క్లుప్తంగా

నిరాశ్రయులకు వసతి



నిరాశ్రయులను నైట్ షెల్టర్ మేనేజర్ మమతకు అప్పగిస్తున్న కంచరపాలెం పోలీసులు

గోపాలపట్నం: కంచరపాలెం పరిధిలోని పలువురు నిరాశ్రయులైన యాచకులను ఐదో పట్టణ పోలీసులు బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ నైట్ షెల్టర్‌కు ఆదివారం తరలించారు. వీరు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కంచరపాలెం సీఐ విజయ్‌కుమార్ ఆదేశాల మేరకు సుమారు 9 మందిని నైట్ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత వీరిని చేర్పించుకున్నారు. వీరికి ప్రత్యేకంగా భోజనం ఏర్పాటు చేసి వసతి కల్పించారు. ఎస్ఐలు జి.రాజారావు, కె.కె.రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలపట్నం రైతుబజార్ సందర్శన



వినియోగదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: గోపాలపట్నం రైతుబజార్‌ను ఆదివారం ఎమ్మెల్యే గణబాబు సందర్శించారు. పలు దుకాణాల్లో కూరగాయల ధరల గురించి ఆరా తీశారు. టమాటా, మిర్చి, అల్లం ధరలు విపరీతంగా పెరిగాయని ఎమ్మెల్యే అన్నారు. టమాటాల కోసం క్యూలైన్లలో బారులు తీరాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారని చెప్పారు. ధరలను అదుపులోకి తీసుకురావాల్సిన అవసరముందన్నారు. నారిపిన్ని సత్తిబాబు, మూర్తి పట్నాయక్, కనక కుమార్, అలజంగి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

13న సుబ్రహ్మణ్యస్వామి ఆడికృత్తిక ఉత్సవం



రవీంద్రనగర్‌లో కొలువైన సుబ్రహ్మణ్యస్వామి

కంచరపాలెం: ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్య స్వామి ఏకాంత ఆలయంలో ఆషాఢ మాస బహుళ ఏకాదశిని పురస్కరించుకుని ఈ నెల 13న ఆడికృత్తిక మహోత్సవం నిర్వహించనున్నట్లు శరవణ ట్రస్ట్ చైర్మన్, ఆలయ ధర్మకర్త దేవాల రాజుకృష్ణ తెలిపారు. క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాలు, అష్టోత్తర శత కలశాభిషేకం, సహస్రనామ విభూది పుష్పాలతో అర్చనలు, సర్పదోష, కాలసర్ప, కుజ రాహు కేతు దోష నివారణకు ప్రత్యేక పూజలు జరుతుతా యని చెప్పారు. గురువారం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, సాయంత్రం దీపారాధన, సుబ్రహ్మణ్య స్వామిని పల్లకీలో ఊరేగిస్తామని, భక్తులు పాల్గోవాలని ఆయన కోరారు.

తీరంలో విజిబుల్ పోలీసింగ్



బీచ్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

జగదాంబ: పర్యాటకుల సంరక్షణ నేపథ్యంలో సాగరతీరాల్లో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. రద్దీగా ఉండే ఆర్కేబీచ్, రుషికొండ బీచ్ వద్ద పర్యాటకులను అలెర్ట్ చేశారు. నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ ఆదేశాల మేరకు మరింత నిఘా పెంచారు.

సాధికార కమిటీ సమావేశం

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురంలో ఆదివారం టీడీపీ అగ్నికుల క్షత్రియ సాధికార కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ పార్లమెంట్ కన్వీనర్ రొయ్య విశ్వనాథ్ మాట్లాడుతూ ఎన్నికల్లో టీడీపీ విజయానికి అగ్నికుల క్షత్రియులు శక్తికి మించి శ్రమించాలన్నారు. వీరి సమస్యలను పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో వార్డు మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి, శీరం రాజేష్, పోత్తబత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

గోతులతో ఇబ్బందులు



గాంధీనగర్‌లో తవ్వి వదిలేసిన రోడ్డు

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు గాంధీనగర్‌లో పైప్‌లైన్ పనుల కోసం రహదారులను తవ్వి వదిలేయడంతో గోతులు ఏర్పడ్డాయి. కాలువలు దెబ్బతిన్నాయి. రాకపోకల సమయంలో పాదచారులు, వాహన చోదకులు రహదారి గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గోతుల పూడ్చివేత, రహదారులు, కాలువల మరమ్మతులకు చర్యలు చేపట్టాలి.

– శ్రీనివాసరావు, గాంధీనగర్

పగలు వెలుగులు.. రాత్రిళ్లు అంధకారం



గౌరీనగర్‌లో పగటి పూట వెలిగి ఉన్న విద్యుత్ లైటు

కంచరపాలెం: జీవీఎంసీ 56, 57 వార్డుల పరిధి ఊర్వశి జంక్షన్ గౌరీనగర్, గోకుల్‌నగర్, సుభాష్‌నగర్, తుమ్మడపాలెం ప్రాంతాల్లో కొన్ని చోట్ల రాత్రి వేళలో వెలగని విద్యుత్ లైట్లు పగలు వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఈ సమస్యపై సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. 78బీ/5 నుంచి 6, 7, 8 12, 13 విద్యుత్ స్తంభాలకు గల లైట్లు వారం రోజులుగా ఉదయం పూట వెలుగుతున్నాయి. రాత్రిళ్లు వెలగడం లేదు. వీధిలైట్ల నిర్వహణలో కాంట్రాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యం కనిపిస్తోంది. సంబంధిత అధికారులు పరిశీలించి ఈ సమస్యను పరిష్కరించాలి.

– ఎండీ అలీఖాన్, గౌరీనగర్

ప్రధాన కాలువను శుభ్రం చేయండి



గణేష్‌నగర్ రైల్వే ట్రాక్ వద్ద ప్రధాన కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు గణేష్‌నగర్ రైల్వే ట్రాక్ సమీపంలోని ప్రధాన కాలువలో మురుగు నిల్వ ఉండిపోతోంది. చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. రోజురోజుకు కాలువ పరిస్థితి దారుణంగా తయారవుతోంది. వ్యర్థాలతో నిండిపోవడంతో భరించలేని దుర్వాసన వెలువడుతోంది. విష పురుగులతో ఇబ్బందులు పడుతున్నాం. సంబంధిత అధికారులు పరిశీలించి కాలువలో పూడిక తొలగించి శుభ్రం చేయాలి.

– రామారావు, గణేష్‌నగర్

గెడ్డను ఆక్రమించి భవన నిర్మాణం

స్థానికుల ఫిర్యాదులు
పట్టించుకోని అధికారులు



నెహ్రూ నగర్‌లో గెడ్డను ఆక్రమించి నిర్మిస్తున్న ఇల్లు

మల్కాపురం: విశాలమైన గెడ్డలు ఆక్రమణకు గురవుతున్నాయి. వీటిపై రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడటం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఓ వ్యక్తి గెడ్డను ఆక్రమించి యథేచ్ఛగా భవనం నిర్మిస్తుండటంపై ఫిర్యాదులు చేసినా.. ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జీవీఎంసీ 59వ వార్డు నెహ్రూ నగర్, ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీకి మధ్య సుమారు 20 అడుగుల వెడల్పు గల గెడ్డ 20 ఏళ్ల కిందట ఉండేది. దీనిని ఆనుకుని నివాసాలు పెరగడంతో 20 కాస్తా 10 అడుగుల గెడ్డగా మారింది. ప్రస్తుతం నెహ్రూ నగర్ గెడ్డను ఆనుకుని ఉన్న దేవాలయం, వార్డు సచివాలయానికి వెనుక ఓ స్థానిక వ్యక్తి కొద్ది కాలం నుంచి గృహ నిర్మాణం చేపడుతున్నాడు. తన ఇంటికి ఆనుకుని పదడుగుల వెడల్పుతో ఉన్న గెడ్డను ఐదడుగుల వరకు ఆక్రమించి ఇల్లు కట్టిస్తున్నాడు. ఈ నిర్మాణం వల్ల వర్షా కాలంలో గెడ్డ పొంగి నీరు నివాసాల్లోకి చేరే అవకాశముందని, దీనిపై ములగాడ మండల రెవెన్యూ తహసీల్దార్ చర్యలు తీసుకోవాలని స్థానిక వినాయక నైబర్‌హుడ్ కమిటీ ప్రతినిధులు గత వారం ఫిర్యాదు చేశారు. స్థానిక రెవెన్యూ సెక్రటరీ శివకుమార్‌కు ఫిర్యాదు అందించారు. అధికారుల వైపు నుంచి నేటికీ ఎటువంటి చర్యలు లేకపోవడంతో.. తనను ఎవరూ ఏమీ అనరన్న ధీమాతో సదరు వ్యక్తి ఆదివారం ఏకంగా శ్లాబ్ ఏర్పాటుకు సన్నాహాలు చేశాడు. సంబంధిత అధికారులు దృష్టి సారించి అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు, నైబర్‌హుడ్ కమిటీ ప్రతినిధులు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై వివరణ కోసం ములగాడ మండల రెవెన్యూ తహసీల్దార్‌ను సంప్రదించేందుకు 'సాక్షి' ప్రయత్నించగా.. ఆయన అందుబాటులోకి రాలేదు.

'మరో గ్రంథాలయ ఉద్యమానికి సిద్ధం కండి'



మరో గ్రంథాలయ ఉద్యమం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకటపతిరాజు, ఉపాధ్యాయులు

మురళీనగర్: పుస్తక పఠనంపై విద్యార్థులు, ప్రజల్లో అవగాహన కల్పించడానికి మరో గ్రంథాలయ ఉద్యమాన్ని నిర్వహించనున్నట్లు 'మరో గ్రంథాలయ ఉద్యమం' ప్రతినిధి బి.వెంకటపతిరాజు చెప్పారు. పుస్తక పఠనం ప్రాధాన్యతపై మాధవధార ప్రాథమిక పాఠశాలలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం పుస్తక పఠనం ప్రాధాన్యత తగ్గిపోతోందని, వచ్చే దశాబ్దంలో పుస్తకం అంతరించే ప్రమాదం ఏర్పడిందన్నారు. పుస్తక పఠనంలో ఉన్న ఆనందం, దాని వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నా రు. రాష్ట్ర వ్యాప్తంగా కాలేజీలు, పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తక పఠనం అలవాటు చేయడానికి మరో గ్రంథాలయ ఉద్యమాన్ని నిర్వహించాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు దీన్ని ఒక సామాజిక ఉద్యమంగా చేపట్టాలని కోరారు. సెల్‌ఫోన్ రుగ్మత నుంచి విద్యార్థులను బయటపడేలా చేయాలన్నా రు. ఈనెల 16వ తేదీన విజయవాడలో రాష్ట్ర స్థాయి మహాసభ నిర్వహిస్తామని ఇందులో గ్రంథాలయ ఉద్యమ కార్యకర్తలు, మేధావులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు హాజరవుతారని చెప్పారు. ఈ సందర్భంగా మహాసభ గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యమ కార్యకర్తలు పెద్ది నాయుడు, కె.శ్రీనివాస్, టి.రామకృష్ణ, ఆర్.రమణమ్మ, విజయశ్రీ, ఉమాపతి, సునీత, నీరజ, సత్యనారాయణ పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి యోగా తప్పనిసరి



సదస్సులో పాల్గొన్న అతిథులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా విభాగం ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమైన రెండు రోజుల జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. యోగా కాన్షియస్‌నెస్ ట్రస్ట్(వైసీటీ)తో సంయుక్తంగా ఏయూ అనుష్టాన యోగ వేదాంత ఫర్ హోలిస్టిక్ లివింగ్ అంశంపై ఈ సదస్సు నిర్వహించాయి. ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి యోగా సాధన తప్పనిసరని చెప్పారు. ఈ సదస్సులో 200 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. బెంగళూరు వ్యాస యూనివర్సిటీ వీసీ డాక్టర్ నాగేంద్ర మానవులలో పెరిగే మానసిక ఒత్తిడి పర్యవసానాలు–ఆరోగ్య సమస్యలు అంశంపై ప్రసంగించారు. వ్యక్తి ఆరోగ్యానికి యోగా ఉపకరిస్తున్న పద్ధతులను తెలియజేశారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ యోగా కేంద్రం విశ్వవిద్యాలయానికి అతిపెద్ద వనరుగా నిలుస్తోందన్నారు. యోగా కాన్షియస్‌నెస్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ టి.ఎల్.నరసింహారావు మాట్లాడుతూ ఒత్తిడిని నివారించడం, నియంత్రించడంలో యోగా విధానాలు, ఉపయోగాలు తెలియజేశారు. సదస్సు కన్వీనర్ ఆచార్య కె.రమేష్‌బాబు, సంచాలకులు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు.భానుకుమార్, డాక్టర్ సి.శ్రావణి, డాక్టర్ ఆర్.తులసీరావు, డాక్టర్ జ్యోత్స్న అగర్వాల్, డాక్టర్ డి.వెంకటరావు, ఆచార్య పి.రవీంద్రనాథ్, డాక్టర్ శ్రీ కృష్ణ, డాక్టర్ సునీత, నాగిరెడ్డి పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వం సమాధానమివ్వాలి'



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: కార్మికులు పట్టు వదలక చేస్తున్న ఉక్కు పరిరక్షణ పోరాటానికి కేంద్ర ప్రభుత్వం సమాధానమివ్వాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 878వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలువురు కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీక్ష శిబిరాన్ని ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు మా ట్లాడుతూ కేంద్రం ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముకుంటూ పోతే భారతదేశంలో ఏ ప్రభుత్వరంగ సంస్థా మిగలదన్నారు. ఇప్పటికే దేశంలో కొత్త పరిశ్రమలు ఏర్పాటు కాక, నిరుద్యోగ సమస్యతో యువత చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారని మండిపడ్డారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా భారతీయులు ఆర్థికంగా ఇంకా వెనుకబడి ఉన్నారని, ఈ సమయంలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌వారికి అమ్మాలని చూడడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు, కార్మికులంతా ఐక్యంగా ఉంటూ ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

తానా మహాసభల్లో మాజీ సీజేని కలిసిన జియ్యాని



మాజీ చీఫ్ జస్టిస్ ఎస్.వి.రమణతో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ దంపతులు

గోపాలపట్నం: ఉత్తర అమెరికా తెలుగు సంఘం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 23వ తానా మహాసభల్లో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ దపంతులు ఆదివారం సుప్రీం కోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎస్.వి.రమణను మర్యాదపూర్వకంగా కలిశారు. తానా ఆహ్వానం మేరకు ఇటీవల జియ్యాని శ్రీధర్ దంపతులు అమెరికా ఫిలడెల్ఫియా నగరానికి వెళ్లారు. ఈ సభల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన వీరు కలిసి ఆనందం వ్యక్తం చేశారు. తానా మహాసభల సందర్భంగా మాజీ సీజే ఎస్.వి.రమణను కలుసుకోవడం సంతోషంగా ఉందని జియ్యాని శ్రీధర్ తెలిపారు.

జోరుగా సబ్సిడీ టమాటా విక్రయాలు



రైతుబజార్‌లో టమాటా కౌంటర్ వద్ద బారులు తీరిన జనం

మల్కాపురం: బహిరంగ మార్కెట్‌లో టమాటాలను అధిక ధరకు విక్రయించడంతో రైతు బజార్ల లో సబ్సిడీపై విక్రయిస్తున్న కౌంటర్ల వద్ద జనం బారులు తీరుతున్నారు. 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీ వద్ద రైతుబజారులో కిలో 50 రూపాయల చొప్పున, ఆధార్ కార్డు గుర్తింపు ఆధారంగా విక్రయిస్తున్నారు. బయట మార్కెట్‌లో కిలో టమాటాలు రూ.120 కి చేరుకోవడంతో ములగాడ రైతుబజారులోని టమాటా కౌంటర్ వద్ద వినియోగదారులు ఆదివారం ఉదయం 5గంటల నుంచే క్యూ కట్టారు.

పేదలకు అమృత కలశాల అందజేత

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పేదలకు అమృత కలశాలను పంపిణీ చేశారు. సత్యసాయి సేవా కార్యక్రమాల్లో భాగంగా ఉక్కునగరం, అగనంపూడి, మదీనాబాగ్, సమ్మిదొడ్డి, ఎల్లమంచిలి దొడ్డి, పరవాడ, దువ్వాడ, ఇస్లాంపేట ప్రాంతాల్లో ఆదివారం ఈ పంపిణీ చేపట్టారు. అందులో పేదలకు ఒక్కో కుటుంబానికి నెలకు సరిపడేలా అత్యవసర కిరాణా సామగ్రి బియ్యం, కందిపప్పు, చింతపండు, వంట నూనె, ఎండుమిర్చిలను సమకూర్చారు. కార్యక్రమాల్లో సత్యసాయి సమితి ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న నిర్వాసిత కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని టీఎస్‌టీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు డిమాండ్ చేశారు. జీతాలు పెంచాలని కోరుతూ గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన సమీపంలోని స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రి వద్ద నిరవధిక దీక్షలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ దీక్ష శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. కార్మికుల పోరాటానికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వేణుగోపాల్ రెడ్డి, సమ్మిడి రాజు, పంచదార్ల పెంటారావు, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వామపక్ష, కార్మిక సంఘాల సంఘీభావం

దీక్ష శిబిరాన్ని ఏఐటీయూసీ, సీఐటీయూ, ఉక్కు నిర్వాసితుల కార్మిక సంఘం, నిర్వాసిత సంఘాల నాయకులు ఆదివారం సందర్శించారు. కార్మికులకు మద్దతు తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు బూసి వెంకటరావు మాట్లాడుతూ తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేఎస్ఎన్ రావు, మసేనురావు, ఎల్లేటి శ్రీనివాసరావు, కేఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్ ఢీకొని మహిళ మృతి



ఘటనా స్థలంలో అపస్మారక స్థితిలో ఉన్న సరోజిని

మల్కాపురం: మారుతి సర్కిల్ వద్ద ఓ కంటెయినర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న సంఘటనలో తీవ్ర గాయాలపాలై, అపస్మారక స్థితికి వెళ్లిపోయిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. ఘటనకు సంబంధించి మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పరవాడ సమీపంలోని ఫార్మసీ కాలనీకి చెందిన సి.సరోజిని (37) భర్తతో మనస్పర్థల కారణంగా విడిగా జీవిస్తున్నారు. ఆమెకు ఇద్దరు అమ్మాయిలు, వారు హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నారు. సరోజిని సొంత పనుల నిమిత్తం ఆదివారం ఉదయం నగరానికి స్కూటీపై వెళ్లి, తిరిగి వస్తుండగా వీడీఆర్ గొడౌన్స్ సమీపంలోని మారుతి సర్కిల్ వద్ద వెనుక నుంచి వస్తున్న కంటెయినర్ వేగంగా ఢీకొట్టి, కొంతదూరం ఈడ్చుకు వెళ్లిపోయింది. ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. స్థానికులు మల్కాపురం పోలీసులకు సమాచారం ఇచ్చి, ఆమెను షీలానగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు చేస్తుండగా ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని పోలీసులు శవపరీక్ష నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతురాలి బంధువులకు సమాచారమిచ్చారు. కేసును మల్కాపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలతో బంగారు భవిష్యత్తు



రోల్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ పైడి వెంకటరమణమూర్తి

మురళీనగర్: విద్యార్థులు క్రీడల్లో పాల్గొని వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కళ ఆస్పత్రి అధినేత డాక్టర్ పైడి వెంకటరమణమూర్తి అన్నారు. మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి రోల్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలను పార్క్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. తల్లిదండ్రులు వారి పిల్లలను క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. ముందుగా రమణమూర్తి టాస్ వేసి టీమ్‌లకు రోల్‌బాల్‌ను అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన 3వ జిల్లా స్థాయి అండర్ 11, అండర్ 14 పురుషులు, మహిళల రోల్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో 200 మంది క్రీడా కారులు పాల్గొన్నారు. విజేతలకు పైడి వెంకటరమణమూర్తి, సనపల వరప్రసాద్ ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైశాఖి స్పోర్ట్స్ పార్క్ అసోసియేషన్ కార్యదర్శి పొట్నూరు నాగరాజు, శాంతి భూషణ్, సురేష్, సూర్యనారాయణ, సౌత్ ఇండియా రోల్ బాల్ కోచ్ అనిల్, విశాఖపట్నం రోల్ బాల్ కోచ్ పి.సంతోష్ పాల్గొన్నారు.

ఎంజీఎఫ్ సభ్యులకు ఘన సత్కారం



బాల చెన్నయ్యను సత్కరిస్తున్న శుభ

మురళీనగర్: అనకాపల్లిలో ఆదివారం నిర్వహించిన వాకర్స్ జిల్లా 101 క్యాబినెట్ సమావేశంలో మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభ్యులను ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ ఫెలోషిప్(ఎంజీఎఫ్) సభ్యులుగా 16 మంది చేరారు. వీరి చేరిక పత్రాలను 101 గవర్నర్ యు.శుభకు చంద్రమౌళి అందజేశారు. ఈ సందర్భంగా కొత్త సభ్యులు ఎ.బాలచెన్నయ్య, బి.వరాహ నరసింహమూర్తి, డి.కుమార్, ఎస్.శ్రీనివాసరావు, కృష్ణన్ కుంజు సురేష్, ఎస్.రామ్మోహన్ రావు తదితరులను మహాత్మా గాంధీజీ పతకాలతో శుభ సత్కరించి అభినందించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణ పుష్పాలు



నిత్య కల్యాణంలో యజ్ఞోపవీతం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా స్వర్ణపుష్పార్చన

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి 8 వరకు స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను శోభాయమానంగా అలంకరించి కల్యాణ మండపంలోని వేదికపై వేంజేపచేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో భ్రమరాంబ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేసి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని జరిపించారు. ఉభయదాతలకు స్వామి వారి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను అందజేశారు.

బీచ్ రోడ్డు.. బ్యూటీఫుల్



ఐటీ జంక్షన్ వద్ద సుందరంగా తీర్చిదిద్దిన బీచ్

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు రోజురోజుకూ మరింత సుందరంగా ముస్తాబవుతోంది. ఇప్పటికే డివైడర్లకు, సైడ్ వాల్స్‌కు, ఫుట్ పాత్‌లకు వివిధ వర్ణాలతో అద్భుతమైన కళాకృతులతో రంగులు అద్దారు. విద్యుత్ దీపాలతో రాత్రి సమయాల్లో మరింత అందంగా కనిపిస్తుంది. దీనికితోడు ఆదివారం ఐటీ జంక్షన్ కల్వర్టు వద్ద ఐరన్ బాక్స్‌లలో నల్లరాళ్ల ఏర్పాటు చేయడంతో మరింత సుందరంగా కనిపిస్తోంది.